క్లుప్తంగా

సైబర్ నేరాలపై అవగాహన



ఆత్మకూర్: అపరిచిత వ్యక్తుల ఫోన్‌కాల్స్‌కు స్పందించ కూడదని, ఓటీపీ తదితర వివరాలను ఇవ్వకూడదని ఎస్సై నరేందర్ అన్నారు. శనివారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా వివిధ గ్రామాలకు చెందిన ప్రయాణికులు, స్థానికులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. లాటరీ తగిలిందని, ఓటీపీ చెప్పమని, బ్యాంకునుంచి ఫోన్ చేస్తున్నామని, మీ ఫొటోలను మార్ఫింగ్‌చేసి డబ్బులు ఇవ్వాలంటూ భయపెడతారని ఇలాంటి వారిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీ గుప్త, సురేందర్, చంద్రకళ, స్వర్ణలత పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



పాన్‌గల్: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ చదువుపైనే దృష్టి సారించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తిరుమల్‌రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 'టెలిమానస్ ప్రోగ్రామ్'పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడారు. విద్యార్థులకు ఎదురయ్యే చిన్న, చిన్న సమస్యలను యోగా, ధ్యానం ద్వారా పరిష్కరించుకోగల సామర్థ్యాలను పెంచుకోవాలన్నారు. సమయం చాలా విలువైనదని దానిని సద్వినియోగం చేసుకొని లక్ష్యానికి అనుగుణంగా చదివితే మంచి ఫలితాలు సాధిస్తారన్నారు. సమావేశంలో అధ్యాపక బృందం, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

అనాథ బాలికకు అండగా ఉంటాం

వీపనగండ్ల: మండల కేంద్రంలో తల్లి తండ్రి మరణించి అమ్మమ్మతో పెరుగుతున్న అలివేల అమ్మమ్మ కూడా అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందగా స్పందించిన ఐసీడీఎస్ అధికారులు శనివారం బాలిక గృహాన్ని సందర్శించారు. బాలికను తమతో పంపిస్తే జిల్లా బాలల పరిరక్షణ పరిధిలో చిన్నారిని అన్నివిధాలా ఆదుకుంటామని ప్రభుత్వం నిర్వహిస్తున్న బాలసదనంలో అన్ని సేవలను అందిస్తామన్నారు. అయితే బాలిక చిన్నమ్మ బాలసదనానికి పంపేందుకు ఇష్టపడక పోవడంతో రాబోయేరోజుల్లో ఎలాంటి ఇబ్బందులు ఏర్పడ్డ అధికారులను సంప్రదించాలని వారి బంధువులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి రాంబాబు, సీడీపీఓ బాలీశ్వరమ్మ, పలువురు అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

'అమృత పథకానికి భూమిపూజ చేయరా'



కొత్తకోట: అమృత పథకానికి కేంద్రం నుంచి నిధులు మంజూరైన గత పాలకులు, ప్రస్తుత పాలకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని శనివారం బీజేపీ ఆధ్వర్యంలో అమృత పథకం నిర్వహించబోయే భూమి వద్ద నిరసన వ్యక్తం చేశారు. పట్టణానికి మెరుగైన మంచి నీటి సౌకర్యం కల్పించాలన్న సదుద్దేశంతో రూ.15 కోట్లను కేంద్ర ప్రభుత్వం 2023న విడుదల చేసిందని వారు పేర్కొన్నారు. అమృత పథకానికి భూమిపూజ చేయడానికి మంత్రి డీకే అరుణ పనులు ప్రారంభించడానికి రెండు పర్యాయాలు సమయం కేటాయిస్తే ఇప్పటి ప్రభుత్వం మున్సిపల్ నాయకులు సమయం ఇవ్వకుండా పబ్బం గడుపుతున్నారన్నారు. అదేవిధంగా 2023లో టీయూఎఫ్ఐడీసీ కింద 30పడకల ఆసుపత్రి మంజూరైన విషయం తెలిసిందే. అయితే ఇప్పటి ప్రస్తుత ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి 50పడకల ఆసుపత్రి అని శంకుస్థాపన చేయడం జరిగిందని ఇంతకు 30 పడకల ఆసుపత్రియా.. లేక 50 పడకల ఆసుపత్రియా అనేది తెలియాలని ప్రశ్నించారు. కార్యక్రమంలో వనపర్తి శ్రీనివాస్‌రెడ్డి, కొమ్ము భరత్ భూషన్, స్టార్ బాలు, రాఘవేందర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, యాదిరెడ్డి, రమేష్‌చారి, సురేష్‌గౌడ్, శ్రీనివాసులు, తిరుపతిసాగర్ బీజేపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శనేశ్వరుడికి పూజలు

బిజినేపల్లి: మండలంలోని నందివడ్డెమాన్‌లో జేష్టాదేవి సమేతంగా వెలసిన శనేశ్వరుడికి భక్తులు తమ ఏలినాటి శనిదోష నివారణ కోసం తిలతైలాభిషేకాలతో ప్రత్యేక పూజలు చేశారు. శనివారం తెల్లవారుజాము నుంచే వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు ఆలయానికి చేరుకుని శనేశ్వరుడిని దర్శించుకుని పూజలు జరిపారు. అలాగే బ్రహ్మసూత్ర రుద్రాభిషేకాలతో మహాశివునికి పూజలు నిర్వహించారు.

అంగన్‌వాడీల సమస్యలు తీరేనా?



నిరసన ప్రదర్శనలో అంగన్‌వాడీ టీచర్స్, ఆయాలు (ఫైల్)

- ప్రభుత్వాలు మారినా..
- ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలంటూ డిమాండ్
- కేంద్రాల్లో ఆయాల కరువు
- సమస్యలు పరిష్కరించాలని వేడుకోలు

కొత్తకోట రూరల్: బాలబాలికలకు, గర్భిణీ మహిళలకు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అంగన్‌వాడీ వ్యవస్థను ప్రవేశపెట్టింది. అయితే సెంటర్లకు కేంద్ర ప్రభుత్వం కొంత వాటా, రాష్ట్ర ప్రభుత్వం కొంతవాటా కలిపి వేతనంగా చెల్లిస్తాయి. కానీ ఏళ్ల తరబడి అంగన్‌వాడీ టీచర్లుగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ వారి సమస్యలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నచందంగా తయారైంది. రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు అంగన్‌వాడీ జీవనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. చాలిచాలని వేతనాలతో బతుకుజట్కా బండిని లాగాల్సి పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు వచ్చినా వాటిని తూచ తప్పకుండా పాటించే వారిలో అంగన్‌వాడీ టీచర్లే ప్రథమంగా ఉంటారు. ప్రభుత్వాలు మారినా తలరాతలు మారడం లేదని అంగన్‌వాడీ టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో..

జిల్లాలో ఆత్మకూర్, వనపర్తి, పెబ్బేరులో అంగన్‌వాడీ ప్రాజెక్టులు ఉన్నాయి. సుమారు 1,050 మంది ఆయా కేంద్రాల్లో టీచర్లుగా, ఆయాలు విధులను నిర్వహిస్తున్నారు. మూడు ప్రాజెక్టులో 28 సెక్టార్లున్నాయి. మొత్తం 589 కేంద్రాల్లో 580మంది టీచర్లు విధులు నిర్వహిస్తుండగా 9 కేంద్రాల్లో టీచర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 589 కేంద్రాల్లో 589 మంది ఆయాలు పనిచేయాల్సి ఉండగా 461 మంది పనిచేస్తున్నారు. 28 కేంద్రాల్లో ఆయాల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్నప్పటికీ వారి వేతనం అంతంత మాత్రంగానే ఉంది. ప్రస్తుతం టీచర్లకు రూ.13,650, ఆయాలకు రూ.7,800 మాత్రమే అందుతోంది.

ఇవీ డిమాండ్లు..

- అంగన్‌వాడీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి
- కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలి
- ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా పీఆర్‌సీ వర్తింపజేయాలి
- పెన్షన్, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత సౌకర్యాలు కల్పించాలి
- హెల్త్ కార్డులను అందజేయాలి
- ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి
- అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు, మౌలిక వసతులు కల్పించాలి

ఎన్నికల వేళ.. హామీల వరద

అసెంబ్లీ ఎన్నికల సమయంలో నాయకులు ప్రభుత్వం అధికారంలోకి రాగానే అంగన్‌వాడీలకు న్యాయం చేస్తామని వారి డిమాండ్లను పరిష్కరిస్తామని హామీలిస్తున్నారు. అంగన్‌వాడీలను ప్రభుత్వం ఉద్యోగులుగా గుర్తిస్తామని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పిస్తామన్నారు. కానీ అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం మాత్రం వారిని చిన్న చూపు చేస్తున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నా అంగన్‌వాడీ ఊసే ఎత్తడం లేదని యూనియన్ నాయకులు, టీచర్లు మండిపడుతున్నారు. కొన్ని కేంద్రాల్లో ఆయాల కరువు ప్రభుత్వ పనితీరును వెక్కిరిస్తోంది. ఒక వైపు చిన్నారులకు అన్ని విధాలుగా చూసుకోవాల్సిన బాధ్యత మరోవైపు సహాయకురాలు లేకుండా పనిచేయడం టీచర్లకు తలకు మించిన భారమవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కచ్చిత వేతనం ఇవ్వాలి



ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న తమకు పనికి తగ్గ వేతనాలు చెల్లించడం లేదు. ప్రభుత్వ ఉద్యోగులు చేసే పనులను తమతో చేయిస్తున్నారు. ప్రభుత్వాలు తమ శ్రమను దోపిడీ చేస్తున్నాయి. ఎన్నికల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి.
– శారద, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు

సమస్యలను వెంటనే పరిష్కరించాలి



ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి. గత ప్రభుత్వం సముచిత న్యాయం చేయలేకపోయింది. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అధికారంలోకి వచ్చి 18నెలలు గడుస్తున్నా ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. సమస్యను పరిష్కరించాలని లేనిపక్షంలో ఆందోళనలు చేపడతాం. – నిక్సన్, సీఐటీయూ జిల్లా కోశాధికారి, వనపర్తి

సీజనల్ వ్యాధులతో జాగ్రత్తగా ఉండాలి



ఆత్మకూర్‌లో పారిశుద్ధ్యం పాల్గొన్న కమిషనర్



వనపర్తిలో జరిమానా విధిస్తున్న శివ

ఆత్మకూర్: దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని నిత్యం ఫాగింగ్ చేపడుతున్నామని పట్టణ ప్రజలు పరిశుభ్రతను పాటించాలని మున్సిపల్ కమిషనర్ శశిధర్ అన్నారు. శనివారం స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో అధికారులు, కార్మికులతో కలసి పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపట్టారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్‌ఎడ్యూకేటర్ సురేందర్‌గౌడ్, వార్డుల అధికారులు రూప్సీరెడ్డి, అనూష, మోహన్ ఉన్నారు.

అమరచింత: పట్టణంలోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు వార్డు ఆఫీసర్‌లతో పాటు మున్సిపల్ సిబ్బంది ముందుండి విధులు నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ నాగరాజు అన్నారు. మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం వార్డు ఆఫీసర్స్, మున్సిపల్ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో మేనేజర్ యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

వనపర్తిటౌన్: ఇంటినే కాకుండా కాలనీని ప్రజలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అప్పుడే సీజనల్ వ్యాధులు, డెంగీ, మలేరియా వంటి విషజ్వరాలు దరిచేరవని మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని ఆయా వార్డుల్లో 100 రోజుల కార్యాచరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల్లో పొడి – తడి వ్యర్థాల విభజనపై అవగాహన కల్పించారు. అదేవిధంగా బాలుర జూనియర్ ఒకేషనల్ కళాశాలలో మొక్కలు నాటారు. పలు దుకాణాల్లో హెల్త్ అసిస్టెంట్ శివకుమార్ ప్లాస్టిక్ రైడ్ నిర్వహించి రూ.5వేల జరిమానాలు విధించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమా మహేశ్వర్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ సాయికృష్ణ, ప్రిన్సిపాల్, లెక్చరర్‌లు శ్రీనివాసులు, మధు, డీఎంసీ బాలరాజు పాల్గొన్నారు.

తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం



గర్భిణుల సీమంతంలో పాల్గొన్న దృశ్యం



ఖిల్లాఘనపురంలో..

ఆత్మకూర్: పుట్టిన బిడ్డకు తల్లిపాలతో, గర్భిణులకు, బాలింతలకు, కిశోర బాలికలకు పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం అందుతుందని ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మమ్మ, సూపర్‌వైజర్ శ్రీలత అన్నారు. శనివారం పట్టణంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారం ఆవశ్యకత, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బిడ్డలకు తల్లిపాలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టీచర్లు రఫీఖాబాను, హసీనాబేగం, ఏఎన్ఎంలు వరలక్ష్మి, నర్సమ్మ పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: తల్లిపాలు బిడ్డలకు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈదమ్మ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఐదో అంగన్‌వాడీలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరై ఆమె మాట్లాడుతూ.. పసిపిల్లలకు ఆరునెలల వరకు కచ్చితంగా తల్లిపాలు మాత్రమే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఇందిర, సరస్వతి, చెన్నమ్మ, సరోజ, కవిత పాల్గొన్నారు.

పింగళి వెంకయ్యకు ఘన నివాళి



పింగళి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కవులు

వనపర్తిటౌన్: భారతదేశ జాతీయ పతాక రూపకర్త, స్వాతంత్ర్య సమరయోధుడు పింగళి వెంకయ్య పోరాటాలు మరువలేనివని మహనీయుల స్ఫూర్తి వేదిక రాష్ట్ర చైర్మన్ రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. మహనీయుల స్ఫూర్తివేదిక ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఎదుట పింగళి వెంకయ్య 149వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు జాతీయ పతాకంతో పింగళి వెంకయ్యకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది ఉత్తరయ్య, కవులు భూరోజు గిరిరాజాచారి, వ్యాఖ్యాత డాక్టర్ నాయకంటి నరసింహాశర్మ, జిల్లా ముస్లిం మైనార్టీ నాయకుడు బాలేమియా, నాయకుడు చింతకుంటకురుమయ్య, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు శెట్టి తదితరులు పాల్గొన్నారు.

'పీఎం కిసాన్'పై సందేహాలు నివృత్తి చేసుకోండి

పాన్‌గల్: 20వ విడత కిసాన్‌సమ్మాన్ నిధులు విడుదల సందర్భంగా శనివారం మండలకేంద్రంలో రైతువేదికలో నిర్వహించిన వీడియో కాన్ఫెరెన్స్‌లో ఏడీఏ తిప్పేస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అర్హులైన రైతులకు ఏడాదికి 3 విడతల్లో రూ.2వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ అవుతాయన్నారు. రైతులకు సందేహాలు ఉంటే ఆయా గ్రామాల పరిధిలోని ఏఈఓలను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ అఖిల, రైతులు పాల్గొన్నారు.

మాంసం విక్రయదారుల కమిటీ ఎన్నిక

కొత్తకోట: పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో మాంస విక్రయదారుల సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం మండలకేంద్రంలోని సంఘం కార్యాలయంలో సంఘం జిల్లా కోశాధికారి బొబ్బిలినిక్సన్ ఆధ్వర్యంలో పట్టణ అధ్యక్షుడిగా ఖాజా, ఉపాధ్యక్షుడిగా ఖాజాహుస్సేన్, ప్రధాన కార్యదర్శి కె.రమేశ్, సహాయ కార్యదర్శిగా కె.శ్యామ్‌లాల్, కోశాధికారిగా చాంద్‌పాషా, సలహాదారులు జమీల్, సయ్యద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

'స్థానిక' ఎన్నికల్లో విజయానికి కృషి చేయాలి

చిన్నంబావి: రానున్న స్థానిక ఎన్నికల్లో బీజేపీ విజయం కోసం కృషి చేయాలని నియోజకవర్గ నాయకుడు ధారాసింగ్ అన్నారు. ఆయన బుధవారం మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు బొగ్గుకురుమయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. వచ్చేస్థానిక ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో విజయం కోసం కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజల్లో కాంగ్రెస్ పార్టీపై వ్యతిరేకత మొదలైందన్నారు. రాష్ట్రంలో పార్టీ ఎదుగుదలను ఓర్వలేని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు విష ప్రచారం చేస్తున్నాయని వాటిని కార్యకర్తలు సోషల్‌మీడియా వేదికగా తిప్పికొట్టాలన్నారు. ఇచ్చిన హామీలను అమలుచేయడంలో కాంగ్రెస్ విఫలంమైందన్నారు. కార్యక్రమంలో గోపి నాయుడు, తగరం నరసింహ్మా, నాగేంద్రం, శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జాగృతి నాయకులు

కొత్తకోట: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేపట్టబోయే 72 గంటల నిరాహార దీక్షకు మద్దతుగా జిల్లా తెలంగాణ జాగృతి యునైటెడ్ పూలే ఫ్రెంట్ ఆధ్వర్యంలో శనివారం నిరాహార దీక్ష పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యునైటెడ్ పూలే సమన్వయకర్త విజయేందర్‌సాగర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్ మరిచిందని, బీసీలను మోసం చేసిందన్నారు. ఈనెల 4 నుంచి 7వ తేదీ వరకు హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద నిరాహార దీక్ష చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కలాంపాషా, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు దాసరి విజయ్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటి సీఎం భట్టివిక్రమార్క, చిత్రంలో మంత్రి జూపల్లి, ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే మేఘారెడ్డి

చిన్నంబావి: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందని డిప్యూటి సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆయన మండలంలోని రూ.2.2కోట్లతో వెల్టురులో ఉపకేంద్రాన్ని ఏర్పాటు చేసిన విద్యుత్ ఉపకేంద్రాన్ని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతిహామీని నెరవేర్చేందుకు కాంగ్రెస్ పార్టీ సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేయలేని పనులను సైతం కాంగ్రెస్ పార్టీ చేస్తుందన్నారు.

వెల్టూరు–గొందిమల్ల వంతెన నిర్మించాలి..

ఇక్కడి ప్రాంత రైతులకు సాగునీరు అందించాలంటే వెల్టూరు–గొందిమల్ల బ్రిడ్జితో సాధ్యమవుతుందని కేఎంఆర్ ట్రస్ట్ చైర్మన్ కొత్త కల్యాణ్‌రావు డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన డిప్యూటీ సీఎం దీనిపై పూర్తిస్థాయిలో పరిశీలిస్తామని తెలంగాణ బార్డర్‌లో ఉండటం చేత ఖచ్చితంగా వెల్టూరు–గొందిమల్ల బ్రిడ్జి సాధ్యసాధ్యాలను పరిశీలిస్తామన్నారు.

వాల్మీకి బోయలను ఎస్టీలో చేర్చాలి

దీర్ఘకాలికంగా ఉన్న వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు ప్రభుత్వం కృషి చేయాలని సంఘం తాలుకా అధ్యక్షుడు రాజ్‌కుమార్ బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు రామకృష్ణ ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎంకు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో ఎంపీ మల్లురవి, ఉమ్మడి ఎమ్మెల్యేలు రాజేశ్‌రెడ్డి, మేఘారెడ్డి, ఎస్పీ రావుల గిరిధర్, అదనపు కలెక్టర్ సుబ్రమణ్యం, కల్యాణ్ రావు, జూపల్లి అరుణ్, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు శ్రీలత రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌యాదవ్, సీఎండీ ముషారఫ్‌అలీ పాల్గొన్నారు.

ఉపముఖ్యమంత్రికి ఘన సన్మానం

వనపర్తి రూరల్: చిన్నంబావి మండలం, వెల్టూర్ గ్రామంలో సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవానికి వెళ్తున్న ఉపముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవికి శనివారం పెబ్బేరులో కిష్టారెడ్డిపేట దగ్గర పెబ్బేరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు వారికి శాలువ కప్పి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ వైస్ చైర్మన్ విజయవర్ధన్‌రెడ్డి, నాయకులు వెంకటేష్‌సాగర్, సురెందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలయ్య గుట్టకు పోటెత్తిన భక్తులు



ఆలయం దగ్గరకు మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

వనపర్తి రూరల్: మండలంలోని పెద్దెడెం శివారులోని తిరుమలయ్య గుట్టకు శ్రావణ మాసం రెండో శనివారం కావడంతో భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి కొండపై వెలిసిన తిరుమలనాథ వెంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు కురుమూర్తి స్వామివారికి ప్రత్యేక అలంకరణ, అర్చనలు, అకుంర్పాణ జరిపించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయం దగ్గర భక్తులకు దాతలు అన్నప్రసాదం వితరణ చేశారు. భక్తులతో తినుబండారాల గుడారాలు కళ కళలాడాయి. జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వనపర్తి రూరల్ ఎస్ఐ జలంధర్‌రెడ్డి భక్తులకు ఎలాంటి అవాంచనీయ సంఘటనలు పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త వెంకటేశ్వర్‌రెడ్డి, సిబ్బంది, వలంటీర్స్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి బోయేజ్

కొత్తకోట రూరల్: త్వరలో జరుగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపుకోసం ప్రతికార్యకర్త, నాయకుడు పనిచేయాలని పార్టీ జిల్లాప్రధాన కార్యదర్శి ఎస్‌జె.బోయేజ్ అన్నారు. శనివారం మండలంలోని నాటవెల్లి, నాటవెల్లి పెద్దతండా, నాచారంపేట గ్రామాల్లో పార్టీ మండల అధ్యక్షుడు భీచుపల్లియాదవ్ ఆధ్వర్యంలో కీలక సమావేశం నిర్వహించారు. బోయేజ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్‌లు హాజరై.. వచ్చే స్థానిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని నాయకులకు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ప్రతి కార్యకర్త పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం ఏకమై పని చేయాలన్నారు. గ్రామాల వారిగా బూత్‌కమిటీలను శక్తివంతం చేసి, కాంగ్రెస్‌పాలనలో సాధించిన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు రావుల కర్ణాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసులు, భీచుపల్లియాదవ్, డాక్టర్ పీజే బాబు, సీడీసీమాజీచైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



పెబ్బేరు కళాశాలలో మొక్క నాటుతున్న దృశ్యం



వనపర్తిలో ప్లాస్టిక్‌పై వివరిస్తున్న సభ్యులు



తిర్మలాయపల్లిలో మొక్కలు నాటుతున్న టీచర్లు



ఆత్మకూర్‌లో మొక్క నాటుతున్న అధ్యాపకులు, విద్యార్థులు

మదనాపురం: మండలంలోని తిరుమలాయపల్లి పీఎస్ పాఠశాల ఆవరణలో ఎంపీఓ హుస్సేనప్ప ఆధ్వర్యంలో శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కల ద్వారా మానవుల మనుగడ ఎంతో ఉందని ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రటరీ యశోద, హెచ్ఎం లక్ష్మయ్య, ఉపాధ్యాయులు మమత, వి కిరణ్, బ్రహ్మయ్య, అంగన్‌వాడీ టీచర్లు పద్మ, రాధమ్మ, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

వనపర్తి రూరల్: మొక్కలు నాటడం వల్ల అనేక రకాల ప్రయోజనాలున్నాయని ఇంచార్జి ప్రిన్స్‌పాల్ ఓబుల్‌రెడ్డి అన్నారు. వనమహోత్సవంలో భాగంగా పెబ్బేరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శనివారం అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటి నీళ్ల పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెట్లతో మంచి ఆక్సిజన్ లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకుడు కృష్ణకుమారి, హనుమంతురెడ్డి, కృష్ణయ్య పాల్గొన్నారు.

వనపర్తి విద్యావిభాగం: ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా తిరుమలయ్య గుట్టను ఏర్పాటు చేద్దామని ఐక్యవేదిక ప్రతినిధులు పిలుపునిచ్చారు. శనివారం పట్టణ శివారులో తిరుమలనాథ స్వామిని అఖిలపక్ష ఐక్య వేదిక నాయకులు దర్శించుకుని, భక్తులకు బట్ట బ్యాగులపై కలిగే లాభాలను వివరించారు. ఈ సందర్భంగా అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్‌యాదవ్ బట్ట బ్యాగులపై ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాండుసాగర్, గొనికాడి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: వృక్షాలే జీవనాధారమని స్వచ్ఛమైన గాలితోపాటు పర్యావరణం కలుగుతుందని ప్రిన్సిపాల్ సైదులు అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో విద్యార్థులతో కలసి మొక్కలను నాటారు. మొక్కలను నాటి వృక్షాలుగా ఎదిగేంతవరకు సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు భాగ్యవర్ధన్‌రెడ్డి, టీజే విశ్వేశ్వర్, కురుమూర్తి ఉన్నారు.